## క్లుప్తంగా

### ప్రహరీ లేక విద్యార్థుల అవస్థలు

మల్దకల్: మండలంలోని బిజ్వారం హరిజన చెర్రి ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఎదుట ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

### సీసీ రహదారి పనులు పరిశీలన



అయిజ: మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌక్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు గ్రామ శివారులోని రహదారి పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఒకవైపువు వంగడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెంటనే విద్యుత్ స్తంభాలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

### రేపు సర్వసభ్య సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 11–00లకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి రాఘవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఘనంగా డీకే స్నిగ్ధారెడ్డి జన్మదిన వేడుకలు

గద్వాల అర్బన్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆ పార్టీ యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాల సదనంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ క్రిష్ణవేణి హాజరై చిన్నారులతో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అదేవిధంగా రాఘవేంద్ర కాలనీలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో చిన్నారులతో కేక్ కట్ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, నాగేందర్ యాదవ్, రజక జయశ్రీ, భాస్కర్ యాదవ్, తుమ్మల నర్సింహులు, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నెమలికంటి రామాంజనేయులు, గీతారెడ్డి, అరుణ్, హేమకర్, రాజశేఖర్, బీజేవైఎం నాయకులు హరిప్రసాద్, ప్రవీణ్, రంజిత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్ యార్డు చైర్మన్‌కు సన్మానం



గద్వాలన్యూటౌన్: లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉంటానని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు ఆయనను పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండల సాయిబాబ, ఉపాధ్యక్షుడు రఘురాజ్‌గౌడ్, కార్యదర్శి మోయినుద్దీన్, సంయుక్త కార్యదర్శి తుమ్మల నర్సింహులు, కార్యవర్గ సభ్యులు ముస్తాక్, అబ్దుల్ ముఖీం, జయన్న, మసూద్, షఫీ, రఫి తదితరులు పాల్గొన్నారు.

### పరీక్షలు ప్రశాంతం

మదనాపురం: సాంఘిక సంక్షేమ కళాశాల, పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం ఆదివారం మదనాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 337 మంది విద్యార్థులకు గాను 317 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా..

- అయిజలో అక్రమ భవన నిర్మాణాలు
- మూడోసారి కూల్చివేతకు ప్రణాళిక



అయిజలో అక్రమ నిర్మాణాలను కూల్చుతున్న అధికారులు(ఫైల్)

అయిజ: అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మిస్తే కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారిపై కొరడా ఝులిపిస్తున్నారు. అయిజ మున్సిపాలిటీలో అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను రెండుసార్లు అధికారులు కూల్చివేశారు. మూడోసారి అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చే ప్రక్రియను ప్రారంభించారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల దూరంలో నిర్మాణాలు చేపట్టాలని నిబంధనలు ఉన్నా విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. అనుమతి లేని కట్టడాలను కూల్చివేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇప్పటికే జాబితా అధికారులు సిద్ధం చేసుకున్నారు.

**జిల్లా అధికారుల దృష్టి**

మున్సిపాలిటీలో అనుమతులు లేని కట్టడాలను జిల్లా అధికారులు గుర్తించారు. ఇప్పటికే నిబంధనలు పాటించకుండా నిర్మించిన ఇళ్లకు ఇదివరకూ కూల్చి వేశారు. మూడో విడుతలో అనుమతిలేని నిర్మాణాలను త్వరలో కూల్చే అవకాశం ఉంది.

**దళారులను ఆశ్రయిస్తున్న నిర్మాణదారులు**

ప్రభుత్వం తెచ్చిన టీఎస్ బీపాస్‌పై ప్రజలకు అవగాహన లేదు. ఇంటి నిర్మాణాల కోసం అనుమతులు ఎలా తీసుకోవాలో తెలియక కొంతమంది దళారులను ఆశ్రయిస్తున్నారు. దరఖాస్తుదారుడి నుంచి అదనంగా డబ్బులు తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకుంటున్నారు. అధికారులకు మామూలు అందజేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కూల్చివేతపై ఆరోపణలు**

మున్సిపాలిటీలో రెండు విడుతల్లో అనుమతిలేని నిర్మాణాలు కూల్చివేసారు. మొదటి విడుతలో 8, రెండో విడుతలో 20 ఇండ్లు కూల్చారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎందుకు కూల్చివేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతోపాటు, వివిధ సంఘాల నాయకులు కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను ఎందుకు కూల్చివేయడంలేదని ప్రశ్నిస్తున్నారు. పేదవారి ఇళ్లను మాత్రమే కూల్చివేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

**అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం**



అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదు. నిబంధనల మేరకు కూల్చివేస్తాం. నిర్మాణానికి ముందే అనుమతులు తీసుకోవాలని ప్రజలకు ఎప్పటికప్పుడు సూచిస్తున్నాం. ప్రజలు దళారులను నమ్మొద్దు. ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి. రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల దూరం వరకు అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తాం.

– గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, అయిజ

**అవగాహన కల్పించాలి**



టీఎస్ బీపాస్‌పై చాలామందికి అవగాహనలేదు. గతంలో ఇండ్లు నిర్మించుకోవాలంటే గ్రామ పంచాయతీ అధికారులు అనుమతి ఇచ్చేవారు. ఆన్‌లైన్ దరఖాస్తుపై అధికారులు అవగాహన కల్పించాలి.

– లింగన్న, అయిజ

**నిర్మాణ దశలోనే నిలిపివేయాలి**



అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇళ్లను ప్రారంభంలోనే గుర్తించాలి. నిర్మాణ దశలోనే గుర్తించి పనులు నిలిపివేయాలి. ఇళ్ల నిర్మాణం పూర్తయిన అనంతరం అధికారులు కూల్చివేయడం సరికాదు.

– తిరుమలేష్, అయిజ

**అందరికి ఒకే న్యాయం ఉండాలి**



పట్టణంలో అనుమతులు తీసుకోని నిర్మాణాలను కూల్చివేసారు. గతంలో పేదవారి ఇళ్లను కూల్చారు. రాజకీయ పలుకుబడి ఉన్న ఇళ్లను కూల్చలేదు. అందరిపై అధికారులు ఒకేలా వ్యవహరించాలి.

– తిప్పారెడ్డి, అయిజ

## సుంకేసుల డ్యాం అధికారులకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఆర్వీ శేషు

రాజోళి: ఆర్డీఎస్ ఆయకట్టుకు తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా అందించే నీటి విడుదలపై ప్రజాప్రతినిధులు, అధికారులు నామమాత్రంగా మాట్లాడి చేతులు దులుపుకుంటున్నారని, యూత్ ఫర్ పబ్లిక్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ శేషు ఆరోపించారు. సుంకేసుల డ్యాం వద్ద కేసీ కెనాల్‌కు వెళ్లే నీటి లెవెల్‌ను తగ్గించుకోవాలని ఆయన ఆదివారం ఏపీ లోని సుంకేసుల డ్యాం అధికారులకు రైతులతో కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుమ్మిళ్లలో మోటార్లు రన్ చేయడానికి, కేసీ కెనాల్ వద్ద నీటి లెవెల్ తగ్గించుకోవాలని వారికి విజ్ఞప్తి చేశారు. తుమ్మిళ్ల మోటార్ రన్ కావాలంటే, కేసీ కెనాల్ వద్ద నీటి లెవెల్‌ను తగ్గించాలని ఏపీ అధికారులతో మాట్లాడామని ఆర్డీఎస్ అధికారులు, నాయకులు చెప్పున్నారని, అలా చెప్పి ఉంటే, ఇప్పటికీ కేసీ కెనాల్ వద్ద అదే స్థాయిలో నీరు ఎందుకు మళ్లిస్తున్నారని ప్రశ్నించారు. ఒకవైపు రైతుల పంటలు ఎండిపోతుంటే, అధికారులు, నాయకులు మాత్రం మాట్లాడామని, నీరు వస్తుందని రైతులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రైతుల పంటలు ఎండే పరిస్థితి వస్తే తుమ్మిళ్ల ఎత్తిపోతలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా మండలాల రైతులు పాల్గొన్నారు.

## మార్చి 1 నుంచి మల్లికార్జునస్వామి జాతర



ముస్తాబైన ఆలయాలు

శాంతినగర్: జూలెకల్ శివారు ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో భ్రమరాంబ సమేతంగా వెలసిన మల్లికార్జునస్వామి వారి జాతర ఉత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని జూలెకల్‌స్టేజీ, జక్కిరెడ్డిపల్లి గ్రామస్తులు తెలిపారు. ఉదయం 7–15 గంటలకు రుద్రాభిషేకం, హోమం, 11.30 గంటలకు శివపార్వతుల కల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 1న భజన పోటీలు, 2న డ్యాన్స్ పోటీలు, స్లో బైక్ రేసులు, గుబ్బల గుండు, సందెరాళ్ల పోటీలు, 3న పశు బలప్రదర్శన పెద్ద బండ లాగుడు పోటీలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాలకు రంగులు వేయించారు.

## బీఆర్‌ఎస్ అరాచకాలను అడ్డుకుందాం



మాట్లాడుతున్న గోవిందు

ధరూరు: బీఆర్‌ఎస్ అరాచకాలను అడ్డుకుందామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో మండల, జిల్లా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని నెట్టెంపాడులో ఏ తప్పు చేయని వారి ఇళ్లపైకి రాత్రి వేళలో బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలను పంపించి దాడులకు పాల్పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, గుడ్డెందొడ్డి, కోతులగిద్ద సమస్యలతో గ్రామస్తులు సతమతమవుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పరుశరాముడు, రాములు, మండల నాయకులు తిప్పన్న, జగదీష్, ఆంజనేయులు, దరెప్ప, గోపాల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరిస్తాం



గుంతను పరిశీలిస్తున్న చైర్మన్ కేశవ్

గద్వాల రూరల్: మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 12, 26వ వార్డులలో ఆయన పర్యటించారు. కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్డుపైనే గుంతను తవ్వడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. అదేవిధంగా కంపచెట్లు, కుక్కల బెడద, డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మన్సూర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస సమస్యలపై నిర్లక్ష్యం



సమస్యలను తెలుసుకుంటున్న రంజిత్‌కుమార్

గట్టు: ఆలూరు పునరావాస కేంద్రంలో సమస్యలపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్ ఆరోపించారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆలూరులో ఆయన పల్లెనిద్ర చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్ తమ భూములు, ఇండ్లను కోల్పోయిన ఆలూరు నిర్వాసితల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పునరావాస కేంద్రంలో ఇప్పటికి సీసీ రోడ్లు వేయలేదని, మురుగు కాలువ సక్రమంగా లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాం, ఉపాధ్యక్షుడు దయాకర్, వెంకట్రాములు, జమ్మన్న, రఘుపతి, నర్సింహులు, విష్ణు, ప్రేమ్‌రాజ్, రంగస్వామి, కృష్ణన్న, గోపాల్, గుండన్న, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

### రేపు వైఎస్సార్‌టీపీ నాయకుల రాక



గద్వాల అర్బన్: ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మాణ పనులు అసంపూర్తి ఉన్నాయని వైఎస్సార్‌టీపీ కో ఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకులు మంగళవారం జిల్లాకు రానున్నట్లు వివరించారు. అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్లు, కాలువలు, తుమ్మిళ ఎత్తిపోతలను సందర్శిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా చిన్నోనిపల్లి భూ నిర్వాసితులు చేపడుతున్న పోరాటం శిబిరం సందర్శించి వారికి మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో యూనుస్, నాసీర్ హుస్సేన్, ఇలియాస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత 90 మంది విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వేణుగోపాల్‌లు సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రూ.50 వేల వ్యయంతో సరస్వతి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటుచేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 23 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు బహుమతులను అందజేశారు. అంతకుముందు మృతి చెందిన అప్పటి గురువులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రఘు, వార్డెన్ రామకృష్ణ, మురళి, వెంకటస్వామి, రాంబాబు, రమేష్, రాజశేఖర్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణే ధ్యేయం

మల్దకల్: మొక్కల సంరక్షణే ప్రభుత్వం ధ్యేయమని సర్పంచ్ పద్మమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని బూడిదపాడు గ్రామ సమీపంలో ఉన్న నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచాలని నిర్వాహకులకు సూచించారు. అదే విధంగా నర్సరీలలో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు సరిచేయండి



విద్యుత్ తీగలను చూపుతున్న గట్టు తిమ్మప్ప

గట్టు: మండలంలోని బల్గెర చెరువు సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఆదివారం రాష్ట్ర కన్జూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప విద్యుత్ తీగలను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని స్థానిక లైన్‌మెన్, ఏఈతో పాటుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తీగలను సరి చేయాలని కోరారు.

## కొంకల సర్పంచ్‌కు ఘన నివాళి



వరలక్ష్మమ్మకు నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల సర్పంచ్ దివంగత వరలక్ష్మమ్మకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు నివాళులర్పించారు. ఈ నెల 16న కొంకల సర్పంచ్ గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం కొంకలలో కుటుంబసభ్యులు నిర్వహించిన ఏకాదశ దినకర్మకు గద్వాల, కర్నూలు జిల్లాలు, హైదరాబాద్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సర్పంచ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి, గట్టు ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్ నాగిరెడ్డి, వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యోగిరెడ్డి, రవిరెడ్డి, ఎనుముల నాగరాజు, సత్యప్రసాద్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, సూరిబాబురెడ్డి, మాణిక్యారెడ్డి, తనగల రాజు, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, తదితరులు ఉన్నారు.

## 'సీఎంఆర్‌ఎఫ్' పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరంగా మారిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, కౌన్సిలర్లు నరహరి శ్రీనివాసులు, కృష్ణ, దౌలు, నాగిరెడ్డి, పార్టీ నాయకులు గోవిందు, రాము, శ్రీనివాసులు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**అన్నదానం**

తిరుపతి క్షేత్రం కల్యాణ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులకు నిత్యం అన్నదాన కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

### దోమల నివారణకు ఫాగింగ్



ధరూరు: దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల దోమల బెడద తీవ్రంగా ఉండడంతో గ్రామ సర్పంచు పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డిలు గ్రామంలోని ఆయా కాలనీల్లో ప్రత్యేక వాహనం ద్వారా ఫాగింగ్ చేయించారు. ప్రతి ఒక్కరు దోమ తెరలను వాడాలని, సీజనల్‌గా వచ్చే రోగాలతో పాటు విష జ్వరాల నుంచి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నియంతృత్వ పాలన



అయిజలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని యాపదిన్నెలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హామీలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలం అయ్యారన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో పేదవారికి ఇళ్లు నిర్మించలేదన్నారు. రైతుల రుణమాఫీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రంజిత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గిడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: బీజేపీ బలోపేతానికి కృషి చేద్దామని గద్వాల అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. ఆదివారం సద్దలోనిపల్లిలో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలు సూచించారు. కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, గోపాల్, లవన్న, బలరాం, రామకృష్ణ, బెల్లం నర్సింహులు, నాగరాజు, లక్ష్మన్న, వెంకటేష్, రాముడు, నారాయణ, దర్శెల్లి పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన



శాంతినగర్: చట్టాలపై అందరికి అవగాహన ఉండాలని సీఐ శివశంకర్‌గౌడ్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రానగర్ కాలనీలో సీఐ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టామన్నారు. 4 జీ, బాల్యవివాహాలు, బాల కార్మికులు, మహిళలపై జరిగే నేరాలు, చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సరియైన ధృవపత్రాలు లేని 25 వాహనాలను గుర్తించారు. కార్యక్రమంలో శాంతినగర్, అయిజ, మానవపాడు రాజోళి ఎస్ఐలు శ్రీనివాసులు, నరేష్, సంతోష్, కుర్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### బీఎస్పీ జెండా ఆవిష్కరణ

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. ఆదివారం యాత్రలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.